క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరుటౌన్: భారత రాజ్యాంగం రూపొందించిన చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన వుండాలని డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐడీ డీఎస్పీ దైవప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలో వైష్ణవి జూనియర్ కళాశాలలో సీఐడీ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ తదితర చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీల పట్ల వివక్ష, వారి అణచివేత, అంటరానితనం, అస్పృశ్యత చూపరాదన్నారు. దేవాలయాలు, హోటళ్లలో అంటరానితనం చూపితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కళాశాల చైర్మన్ గడిగె లింగప్ప, సీఐడీ సీఐలు దస్తగిరి, శివప్రసాద్, సీఐలు శ్రీనివాసులు, విక్రమసింహా, రామచంద్ర, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోటీలతో ఆలోచన శక్తి పెంపు

ఆదోని అర్బన్: పోటీల వల్ల విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మక శక్తి పెరుగుతుందని ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ తెలుగు పండిట్ నల్లపు రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ దేవేంద్ర తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారిణి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నెహ్రూ మెమోరియల్ పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాల, వివేకానంద పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలను నిర్వహించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఆదోని రూరల్: పట్టణంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా రాస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. తాహేర్, ఉదయ్‌కుమార్ మట్కా రాస్తుండగా దాడి చేసి వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామలింగయ్య తెలిపారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు శ్రీనివాస రాజు, వేణుసూర్య, డీఎల్‌డీపీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని సెంట్రల్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలు బైక్ నడపరాదన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చేతికి బైక్‌లు ఇచ్చి, ఇబ్బందులను కొని తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ కాలేజీలో వనభోజనం



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో సోమవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ జయం శ్రీనివాసగుప్త ఆధ్వర్యంలో విద్యార్థినులు వనభోజన కార్యక్రమం జరుపుకున్నారు. కాలేజీ అవరణలోని ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించగా విద్యార్థినులు, లెక్చరర్లు పూజలో పాల్గొన్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న ఆదోని బీసీ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహం



గోనెగండ్లలోని బీసీ బాలికల హాస్టల్‌కు వెళ్లే దారిలో పిచ్చి మొక్కలు పెరిగిన దృశ్యం



ఎమ్మిగనూరు బీసీ హాస్టల్‌లో అధ్వానంగా స్నానపు గదులు



పెద్దకడబూరు హాస్టల్‌లో పెచ్చులూడిన విద్యార్థుల వసతి గది



కోసిగి కమ్యూనిటీ హాస్టల్‌లో బాత్‌రూంలో కంపు భరించలేక ముక్కుమూసుకున్న విద్యార్థులు

సంక్షేమ హాస్టళ్లు.. విద్యార్థుల వెతలు

సాక్షి విజిట్

- సంక్షేమ వసతిగృహాల్లో సమస్యల తిష్ట
- వెంటాడుతున్న నీటి ఎద్దడి
- మురుగున పడ్డ దొడ్లు
- హైకోర్టు మొట్టికాయ వేసినా స్పందన లేని సర్కారు



మంత్రాలయం బీసీ హాస్టల్‌లో నిరుపయోగంగా శౌచాలయాలు

మంత్రాలయం/ఆదోని సెంట్రల్/ ఆదోని టౌన్ /ఎమ్మిగనూరుటౌన్/నందవరం: సర్కారు వసతి నిలయాల్లో ఇక్కట్ల గంట మోగుతోంది. కాలకృత్యాలు మొదలు ఆకలి దప్పుల వరకు వెతలే. పేద విద్యార్థుల సంక్షేమం ఒట్టిమాటే. నిత్య కష్టాలతో విద్యార్థులు పడుతున్న ఆపసోపాలు వర్ణనాతీతం. శుభ్రత, భద్రత మాటల్లోనే ఉండిపోయాయి. హాస్టళ్లలో సమస్యలపై రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం మొట్టికాయ వేసినా సర్కారులో చలనం లేకపాయే. ప్రభుత్వ హాస్టళ్లను సాక్షి విజిట్ చేయగా వెలుగు చూసిన సమస్యల చిట్టా ఇదిగో..

మంత్రాలయం నియోజకవర్గంలో..

మంత్రాలయం నియోజకవర్గ పరిధిలో ఒక కమ్యూనిటీ హాస్టల్, రెండు బీసీ హాస్టళ్లు ఉన్నాయి. కోసిగి కమ్యూనిటీ హాస్టల్‌లో 210 మంది, మంత్రాలయం బీసీ హాస్టల్‌లో 110 మంది, పెద్దకడబూరు బీసీ హాస్టల్‌లో 134 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో దాదాపు 70 మందికి పైగా విద్యార్థులు గైర్హాజరు అవుతున్నారు.

సమస్యల వేదన

☛ మంత్రాలయం హాస్టల్ శౌచాలయాలు శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులందరూ కుళాయిల వద్దే స్నానాలు అచరిస్తున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో హాస్టల్ పక్కనే ఉన్న కంపచెట్లలోకి బహిర్భూమికి వెళ్తున్నారు.

☛ హాస్టల్ చుట్టూరా కంప చెట్లు ఉండటంతో దోమల బెడద అధికంగా ఉంది.

☛ పెద్దకడబూరు హాస్టల్‌లోనూ బాత్ రూములు నిర్వహణ అధ్వానంగా ఉంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తోంది.



నందవరంలో వాటర్ సింక్ వద్ద బట్టలు ఉతికి స్నానాలు చేస్తున్న విద్యార్థులు

☛ వర్షం వస్తే కాంపౌండ్‌లోనే నీటి నిల్వ ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది.

☛ వసతి గదిలో పెచ్చులూడటంతో విద్యార్థులు రాత్రి పూట డైనింగ్ హాల్‌లో నిద్రిస్తారు.

☛ కోసిగి కమ్యూనిటీ హాస్టల్‌లో మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. విద్యార్థులు బాత్ రూముల వైపు వెళ్లాలంటేనే వెనకడుగు వేస్తున్నారు. విద్యార్థులు ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు.

☛ హాస్టల్ చుట్టూర మురుగు నీరు నిల్వడంతో దుర్వాసనతో విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు.

☛ హాస్టల్ పక్కనే చెత్త సేకరణ కేంద్రం ఉండటంతో వాసనతో అల్లాడిపోతున్నారు.

☛ హాస్టల్‌కు ఎలాంటి ప్రహరీ లేకపోవడంతో పందుల బెడద ఎక్కువగా ఉంది. ఇలా ప్రతి హాస్టల్‌లోనూ ఇవే ఇక్కట్లు ఉండటం విద్యార్థులను వేదనకు గురిచేస్తోంది.

ఆదోని సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు

☛ ఆదోని పట్టణంలో బాలికల ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో 567 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాచ్‌మెన్లు 6 మంది ఉండాల్సిన చోట ముగ్గురు మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత వంటి వాటితో ఇబ్బందులకు గురవుతున్నారు. అంబేడ్కర్ ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో 623 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విజిటర్స్ బుక్ కూడా మెంటైన్ చెస్తున్నారు. వాచ్‌మెన్‌లు ఆరుగురు ఉన్నప్పటికీ కుక్కర్స్ తక్కువగా ఉన్నారు. ఆరుగురు ఉండాల్సిన చోట నలుగురు మాత్రమే ఉన్నారు. బాత్‌రూమ్స్, టాయిలెట్స్ నిర్వహణకు అవసరమైన రసాయనాలు పంపిణీ చేయడం లేదు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నారు.



నందవరం హాస్టల్‌లో నీరు లేక వినియోగంలో లేని బాత్‌రూం, మరుగు దొడ్డి

☛ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల వసతి గృహాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. మంత్రాలయం బీసీ బాలికల జూనియర్ వసతి గృహంలో 130 మంది, ఆదోని బాలికల జూనియర్ బీసీ వసతి గృహంలో 140 మంది, బాలికల బీసీ వసతిగృహంలో 165 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. వసతి గృహాల్లో టాయిలెట్స్, బాత్‌రూమ్ వంటి సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. బాలికల భద్రతకు అవసరమైన సీసీ కెమెరాలు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆదోని బీసీ బాలికల వసతి గృహంలో వార్డెన్ సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వసతి గృహాల్లో ఫ్యాన్లు, లైట్స్, బాత్‌రూమ్స్, టాయిలెట్స్ వంటి నిర్వహణకు ఇంత వరకు ఎలాంటి నిధులను ప్రభుత్వం మంజూరు చేయలేదు. దీంతో ఉన్నవాటితోనే సర్దుతూ విద్యార్థులకు సౌకర్యాలను కల్పించేందుకు అధికారులు అవస్థలు పడుతున్నారు.

☛ ఆదోనిలోని మైనార్టీ, జనరల్ కస్తూర్బాగాంధీ విద్యాలయాలకు కంపౌండు వాల్ నిర్మించడం మరిచిపోయారు. దీంతో విద్యార్థినులకు కొంత అసౌకర్యంగా ఉంటుంది. విద్యాలయాల్లో సీసీ కెమెరాలు, విజిటర్స్ పుస్తకం వంటివి ఏర్పాటు చేసినా విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి.

అద్దెభవనాల్లో అరకొర వసతులు

ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్సీ, బీసీ పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ బాలుర, బాలికల సంక్షేమ వసతి గృహాలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. గుడికల్ రోడ్డులోని బీసీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో పై అంతస్తులో గదులు వుండటం, కింద ఆరుబయట నుంచి స్నానపు గదులు, మరుగుదొడ్లకు వెళ్లేందుకు దారి ఉండటంతో రాత్రి వేళల్లో విద్యార్థులు ఎవరో ఒకరి సహాయంతో వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొనే దుస్థితి. హాస్టళ్లలో నాల్గవ తరగతి ఉద్యోగ పోస్టులు ఖాళీగా వుండటంతో పర్యవేక్షణ అంతంత మాత్రంగా వుంది.

☛ గోనెగండ్లలోని బీసీ బాలికల హాస్టల్ నిధుల కొరతను ఎదుర్కొంటుంది. దాదాపు 8నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో హాస్టల్ వార్డెన్ అప్పులు తీసుకువచ్చి హాస్టల్ నడుపుతున్నారు. ఈ హాస్టల్‌లో దాదాపు 250 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరికీ సరిపడ గదులు, బాత్రుములు లేవు. ప్రస్తుతం పది బాత్రుములు ఉన్నాయి. ఇందులో ఐదు పాత వాటినే వాడుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. మూడు అదనపు గదులు, బాత్రుములు కట్టించాల్సి ఉంది. హాస్టల్ గ్రామ చివరలో ఉంది. చుట్టూ పంట పొలాలు, ఎల్లెల్సీ కాలువ ఉంది. రాత్రి వేళల్లో విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. హాస్టల్‌కు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అలాగే హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లేందుకు దారి సమస్య ఉంది. ప్రస్తుతం ఖాళీ స్థలంలో నుంచి పాఠశాలకు వెళ్తున్నారు.

☛ నందవరం కమ్యూనిటీ హాస్టల్‌లో సంక్షేమం కరువైంది. హాస్టల్‌లో 238 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విద్యార్థులకు సరిపడ గదులు ఉన్నా నీటి వసతి, మరుగు దొడ్ల నిర్వహణ దారి తప్పింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థులు బహిర్భూమికి వెలవసివస్తోంది. ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో కంప చెట్లలలోకి వెళ్లాల్సివస్తోంది. వాడుకునే నీటినే తాగడానికి వినియోగిస్తున్నారు. హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ ఊరి చివరన ఉడడంతో చుట్టూ కంప చెట్లు, ముందు భాగంలో శిథిలావస్థలో ఉన్న పాత హాస్టల్ భవనం ఉంది. దీంతో విద్యార్థులు రాత్రి వేళలో భయభ్రాంతులకు గురవుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించి ప్రహరి నిర్మించాలని, నీటి సమస్యను తీర్చాలని విద్యార్థులు, తల్లి దండ్రులు కోరుతున్నారు. అలాగే మురుగు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి



మా హాస్టల్‌లో తీవ్ర నీటి సమస్య ఉంది. 238 మంది విద్యార్థులు వసతి పొందుతున్నా..నీటి వసతి, ప్రహరీ లేక తీవ్రఇబ్బందులు పడుతున్నాం. స్నానానికి, తాగడానికి ఒకే నీటిని వాడతున్నాం. చాలా ఇబ్బందిగా ఉంది. నీటి వసతి కల్పించి, చుట్టూ కంప చెట్లు, చెత్తా చెదారం, ముందు భాగంలో శిథిలమైన పాత భవనం తొలగించి ప్రహరీ నిర్మించాలి.

– బి. శివ, 10వ తరగతి, నందవరం

మరుగుదొడ్ల నిర్వహణ లేదు



మా హాస్టల్‌లో మరుగుదొడ్లు ఉన్నా ప్రయోజనం లేదు. క్లీనింగ్ చేయక పోవడంతో కంపు కొడుతున్నాయి. కంపును భరించలేక బయటనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నాం. హాస్టల్‌కు కాంపౌండ్ కూడా లేదు. పందులు హాస్టల్ చుట్టూ తిరుగుతున్నాయి. మురుగు నిల్వలు కారణంగా దోమలు అధికంగా ఉన్నాయి. అధికారులు మా కష్టాలు తీర్చాలి.

– మల్లికార్జున, కోసిగి

విద్యార్థినులకు భద్రత కల్పించాలి



వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. రెసిడెన్షియల్ పాఠశాలల్లో కొంత వరకు సీసీ కెమెరాలు, విజిటర్స్ బుక్స్ మెంటైన్ చేసినా.. సంక్షేమ వసతి గృహాల్లో సీసీ కెమెరాలు వ ంటివి లేవు. అరకొర వసతుల మధ్య విద్యార్థి నులు కాలం గడుపుతున్నారు. భోజనంలో నాణ్యత కొరవడుతుంది. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించడంతో భద్రత కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

– షాబీర్ బాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు ఉన్నాయి. సంక్షేమ వసతి గృహాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ బిల్డింగ్ మరమ్మతులకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. త్వరలో పనులను కూడా చేపడతాం.

– రాజు కుల్లాయప్ప బీసీ ఏఎస్‌డబ్ల్యూఓ ఆదోని



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట భర్త బుట్టా శివనీలకంఠ, యువ నాయకుడు బుట్టా ప్రతుల్ ఉన్నారు.

– ఎమ్మిగనూరుటౌన్

ఘనంగా భక్త కనకదాసు జయంతి

ఆదోని అర్బన్: భక్త కనకదాసు జయంతిని సోమవారం కురువ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. క్రాంతినగర్‌లో కురువ కులస్తులు స్థానిక శంభులింగేశ్వరస్వామి ఆలయం నుంచి కనకదాసు చిత్రపటాన్ని ఎద్దులబండిలో ఉంచి ప్రధాన రహదారుల్లో ఊరేగించారు. క్రాంతినగర్‌లోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రవి, కాశీ, శ్రీనివాసులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టా రు. అలాగే పట్టణంలోని విక్టోరియాపేటలో కురువలు భక్త కనకదాసు చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. మాదాసి కురు వ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజుగౌడ్, నాయకులు భాస్క ర్, చౌడప్ప, కుబేర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బీరలింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో సోమవారం భక్తకనకదాసు జయంతిని కురువ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్త కనక దాసు చిత్రపటానికి కురువ సంఘ నాయకులు కెటి ఉరుకుంద, మద్దిలేటి, పిల్లిగుండ్ల నాగన్న, పెసలదిన్నె వెంకప్ప, అంజినయ్య తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.



భక్త కనకదాసు చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగిస్తున్న క్రాంతినగర్‌వాసులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని గీతాశ్రమంలో కురువ సంఘం ఆధ్వర్యంలో భక్త కనకదాసు 537వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే అగసనూరు గ్రామంలో గ్రామ పెద్దల సమక్షంలో కనకదాసు చిత్ర పటానికి పూజలు చేశారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండలంలో వివిధ ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం కోసిగి పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టుబడిన కర్ణాటక మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడించారు. సమాచారం మేరకు కోసిగి మండలం పల్లెపాడు గ్రామంలో సీఎస్ఐ చర్చి వద్ద నుంచి రచ్చుమర్రి గ్రామానికి చెందిన రాము అనే వ్యక్తి కేఏ13బీ 4334 అనే నంబర్ గల ఇండికా కారులో 21 బాక్స్‌లలో 2016 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీ కాగా రామును అరెస్ట్ చేసి, మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే మండలంలోని కందుకూరు గ్రామ క్రాస్ రోడ్డు వద్ద కడదొడ్డి గ్రామానికి చెందిన అంజినయ్య, కరణి గ్రామానికి చెందిన రామాంజి రెండు బైక్‌ల పై 24 బాక్స్‌లలో 2304 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బైక్‌లను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలించామన్నారు. వారి వెంట వచ్చిన మరో వ్యక్తి పరారైనట్లు వెల్లడించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని దిబ్బనకల్ గ్రామంలో వీరేష్ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతుండగా సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. అతని వద్ద నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 80 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామ అంగన్‌వాడీ కార్యకర్త నాగవేణి అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతదేహానికి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధనమ్మ, నాగేశ్వరమ్మ, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు నివాళులర్పించారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. బింగేరి రామ అనే రైతుకు చెందిన ఎద్దు పొలంలో మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు తగిలి ఎద్దు అక్కడిక్కడే మృతి చెందింది. రూ.60వేలు విలువైన ఎద్దు మృతి చెందడంతో రైతు రామ లబోదిబోమంటున్నాడు. కాగా ఈ ఎద్దును ఉదయం వ్యాపారస్తులు రూ.50వేలకు అడుగగా రైతు ఇంత తక్కువ రేటుకు ఇవ్వాలేనని చెప్పి ఎద్దును తీసుకుని పొలానికి వెళ్లాడు. పొలంలో ఎద్దు మృతితో రైతు దిగాలు చెందుతున్నాడు.

రజకులపై దాడులు అరికట్టాలి

ఆదోని అర్బన్: రాష్ట్రంలో రజకులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కన్న, పట్టణ రజక నాయకురాళ్లు కవిత, అనసూయలు ఏపీ రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రిని కోరారు. కార్పొరేషన్ చైర్మన్ సావిత్రిని సోమవారం ఆదోనిలో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ రజకులకు ఎస్సీ, ఎస్టీ తరహాలో రజకుల రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. దేవదాయ, ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీసుశాఖలో దోబీ పోస్టులు రజకులకే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, జయమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



మార్కండేయస్వామికి లక్షబిల్వార్చన



ఉరుకుందలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఎమ్మిగనూరు: కార్తీక మాసం సందర్భంగా సోమవారం పట్టణంలోని ఆయా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రెవెన్యూ కార్యాలయ ఆవరణలోని దత్తసాయి దేవాలయంలో సహస్ర శివలింగ దర్శనం, ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. తేరుబజార్‌లోని శ్రీ నీలకంఠేశ్వర దేవాలయంలో శివుడికి అభిషేకం, అష్టోత్తరం, మహామంగళహారతి చేపట్టారు. వీవర్స్‌కాలనీ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శివుడు, ఆంజనేయుడు, సాయిబాబా స్వాములకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అలాగే బైపాస్ రోడ్డులోని శ్రీ సుశీలాంబ దేవాలయం, తేరుబజార్‌లోని శ్రీ మార్కండేయ దేవాలయం, శ్రీ నీలకంఠేశ్వర దేవాలయం, రామస్వామి దేవాలయం, సుంకులమ్మ, మారెమ్మ, శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలతో పాటు ఇతర దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుండే అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్కండేయస్వామికి లక్ష బిల్వార్చన

ఆదోని అర్బన్: పట్టణంలోని చిన్నమార్కెట్‌లో వెలిసిన శ్రీ మార్కండేయస్వామికి కార్తీకమాసం మూ డో సోమవారం సందర్భంగా లక్ష బిల్వార్చన పూజ లు జరిగాయి. పద్మశాలీసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి భక్తుడి చేత బిల్వార్చన పూజలు చేయించారు. కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు నీలి లక్ష్మన్నస్వామి, జక్కా వీరేష్, గోరంట్ల నారాయణమూర్తి, రంగస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల పుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు దేవాలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. కార్తీకమాసం కావడంతో భక్తులు దేవాలయ ఆలయ ప్రాంగణంలో, నవగ్రహాలు, బసవన్నగుడి వద్ద దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు.

వైభవంగా కార్తీక పూజలు

నందవరం : ప్రముఖ పుణ్య క్షేత్రం గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి హంపేష్ స్వామి ఆధ్వర్యంలో ఆదిదంపతుల (రామలింగేశ్వర స్వామి, పార్వతీ దేవి)కి ప్రత్యేక పూజలు గావించారు.

భగవద్గీత పోటీల్లో చిన్నారి ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని జివ్వేశ్వర ఉన్నత పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న నేహా అనే విద్యార్థిని పట్టణంలోని చిన్మయ మిషన్ వారు నిర్వహించిన పోటీలలో భగవద్గీత శ్లోకాలను వల్లించి మొదటి స్థానంలో నిలిచిందని పాఠశాల నిర్వాహకులు జిందే గోవిందరావు, సపారే నాగరాజ్, గగేశి నాగరాజ్ సోమవారం తెలిపారు. పాఠశాల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదోని టౌన్: నిజాముద్దీన్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కోరారు. సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కాలనీలో పడిపోయిన మరుగుదొడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలన్నారు.